క్లుప్తంగా

నేటి నుంచి పోస్టల్ గ్రామీణ ఉద్యోగుల సమ్మె

మల్హర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. నేటి నుంచి పోస్టల్ గ్రామీణ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తాడిచర్ల బ్రాంచీ గ్రామీణ తపాల ఉద్యోగి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్ సర్వేంట్ హోదా వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏడవ వేతన కమిటీలో అమలు కాని అన్ని అంశాలను వెంటనే అమలు చేయాలి కోరారు. టార్గెట్ మేళా రూపంలో జిడియస్ ఉద్యోగులు ఎదుర్కొంటు న్న అన్ని రకాల వేధింపులు ఆపాడంతో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని దేశ వ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు.

'ప్రమాణ స్వీకారం చేయకపోవడం సరికాదు'

భూపాలపల్లి రూరల్: అక్బరుద్దీన్ ఓవైసీని ప్రొటెం స్పీకర్‌గా ఎన్నుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయకపోవడాన్ని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, తీవ్రంగా ఖండిస్తుందని ఆ కమిటీ సభ్యులు కర్ణాటకపు సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్బరుద్దీన్ ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణ స్వీకారం చేయమని ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు చేయడం భారతదేశ సార్వభౌమత్వాన్ని శంకిచడమే అవుతుందన్నారు. ఈ విషయాన్ని, ప్రజలు ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

నిత్యావసరాల అందజేత



ములుగు రూరల్ : ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఐత రాజయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గంద్రకోట సుధీర్ సేవా ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. ఈ మేరకు సోమవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించి, అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సభ్యులు కందికొండ కుమార్, చింత రాజు, రంజిత్, అంజి, సంపత్, వినయ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ పోటీ

ములుగు రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ములుగు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తారని బహుజన సమాజ్ పార్టీ నియోజవకర్గ ఇన్‌చార్జ్ భూక్యా జంపన్న అన్నారు. ఈ మేరకు సోమవారం ములుగులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శనిగరపు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినందుకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు కుంగిపోవద్దని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఎన్నికల్లో 30శాతం యువతకు ప్రాధాన్యం కల్పిస్తామని అన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆశయాలకు అనుగుణంగా యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రాజేందర్, పసులాది ముకేష్, తిరుమల, భిక్షపతి ఉన్నారు.

సన్నాలకు పెరిగిన డిమాండ్

- ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు, ప్రైవేట్ వ్యక్తులకు విక్రయం
- కొనుగోలు కేంద్రాలకు మొగ్గు చూపని రైతులు



ధాన్యం కాంటా పెడుతున్న హమాలీలు

మల్హర్: సన్నరకం ధాన్యానికి డిమాండ్ భారీగా పెరిగింది. వానాకాలం సీజన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు పండించిన సన్నాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే ఎక్కువకు అమ్ముకునే అవకాశం రావడంతో పంటలను నేరుగా రైసు మిల్లర్లు, ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించడాని ఆసక్తి చూపుతున్నారు. రైతులు పంట కోసిందే ఆలస్యం మిల్లర్లు, వ్యాపారులు పొలంలోకే వెళ్లి ధాన్యాన్ని కొంటున్నారు. 17 శాతంలోపు తేమ వచ్చి ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే క్వింటా ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, కామన్ ధాన్యానికి రూ.2,183 ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ తేమతో సంబంధం లేకుండా మిల్లర్లు, ప్రైవేట్ వ్యక్తులు రూ.2,100 నుంచి రూ.2,300 వరకు చెల్లిస్తున్నారు.

15వేల ఎకరాల్లో సాగు..

మండల వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ సూచనల మేరకు 1001, 1121, 1153, 1156, 3291 రకాలు రైతులు సాగు చేయకుండా ఎంటీయూ 1061, 1064, 1224, 1262, 1271, 1318, 7029, 24423, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, సోనా, బీపీటీ 5204 వంటి సన్న రకాలు సాగు చేశారు. 1001 సైతం కొంత మంది రైతులు సాగు చేశారు.

సమయం ఆదా



నాకున్న 5 ఎకరాల్లో వరి సాగు చేశాను. 100 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. తేమ శాతం సంబంధం లేకుండా మద్దతు ధర కంటే అధికంగా చెల్లించడానికి వ్యాపారులు ముందుకు వస్తున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యానికి పరదాల ఖర్చు, హమాలీ చార్జీ ఉంటుంది. నేరుగా వ్యాపారులు కొనుగోలు చేయడంతో ఇలాంటి ఇబ్బందులు ఉండవు. రెండు మూడు రోజుల్లో డబ్బులు కూడా ఇస్తామని చెబుతున్నారు. కల్లాల్లో ధాన్యాం ఆరబోయకుండా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నా. దీంతో సమయం కూడా వృథా కాకుండా ఉంటుంది.

- ప్రవీణ్‌రెడ్డి, యువ రైతు, కుంభంపల్లి, మల్హర్

కొనుగోలు కేంద్రాలకు తగ్గిన ధాన్యం

రైతులు పండించిన సన్నరకం ధాన్యం అమ్ముకోవడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకి తరలించడాని ఆసక్తి చూపించడం లేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉండటానికి వీలు లేదు. ఒక వేళ తేమ ఎక్కువగా ఉంటే మిల్లర్లు తిరస్కరిస్తారు. ఇప్పుడు మాత్రం.. రైస్ మిల్లర్లు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తేమ 24–25 శాతం ఉన్నా మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు కొనడానికి మిల్లర్లు ముందుకు వస్తున్నారు. హార్వెస్టర్లతో వరి కోతలు కోయటం, వెంటనే ధాన్యాన్ని బస్తాల్లో నింపడంతో ధాన్యం ఎండే పరిస్థితి లేదు. అయినా మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా ధాన్యం నేరుగా కొనుగోలు చేస్తుండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో తరలించకుండా నేరుగా మిల్లులకు, వ్యాపారులకు విక్రయించడంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తగ్గుతున్నాయి. కేంద్రాల్లో వెయింటింగ్, పరాదల ఖర్చు, హమాలీ చార్జీలు లేకుండా మద్దతు ధర కంటే ఎక్కువగా, రెండు, మూడు రోజుల్లో డబ్బులు చేతికి వస్తుండటంతో రైతులు మిల్లుకు, ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

మిర్చి తోటల పరిశీలన



మిర్చి పంటను పరిశీలిస్తున్న రమేష్

మహదేవపూర్: మండలంలోని మిర్చి తోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తామర పురుగు తెగుళ్లు మిరుప పంటను ఆశిస్తున్నందున పరిశీలించినట్లు తెలిపారు. మిర్చి తోటల్లో గత సంవత్సరం కంటే నల్ల తమర పురుగు ఉధృతి తగ్గిందన్నారు. మిర్చి సాగు చేసే రైతులు దుక్కి నుంచే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నారు పోసే సమయం నుంచి కోతకు వచ్చే వరకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. అలాగే రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న ఫిలిప్‌రాజు

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 'రైస్ లవ్ స్వచ్ఛంద సంస్థ'ఆధ్వర్యంలో సోమవారం బియ్యం పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 100మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ 20కిలోల సన్న బియ్యంను డీఈఓ రాంకుమార్ చేతుల మీదుగా పేద విద్యార్థుల తల్లిదండ్రులకు చేయూతనివ్వడానికి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పుల్లూరి ఫిలిప్‌రాజు ఆధ్వర్యంలో అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్ బియ్యం పంపిణీ చేసిన సంస్థ డైరెక్టర్ ఫిలిప్ రాజును, ఇందుకు సహకరించిన ఉపాధ్యాయురాలు గ్లోరిరాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరహరి పద్మ, ఎస్ఎంసీ చైర్మన్ ఆళ్ల గోపాల్రెడ్డి, ఏఎస్సై వెంకటరత్నం, ఏఎస్వో రాజయ్య, ఉపాధ్యాయులు నరసింహస్వామి, సంపత్ కుమార్, సదానందం, వీరయ్య, ఉమరాణి, మధుసూదన్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఐక్యవేదిక నాయకులు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని విప్లవ పార్టీల ఐక్యవేదిక నాయకులు కోరారు. జాడిగట్టయ్య అధ్యక్షతన సోమవారం సీపీయూఎస్ఐ కార్యాలయంలో విప్లవ పార్టీల ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ మాట్లాడారు. నూతనంగా ప్రజల చేత ఎన్నుకోబడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటు వంటి ఆరు గ్యారంటీ పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రానున్న సింగరేణి ఎన్నికల్లో విప్లవ పార్టీల సంఘాల నాయకులను గెలిపించుకోవాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఉన్నటువంటి నిరుపేదలు, నిరుద్యోగులు, కార్మికులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల సమస్యల కోసం, ప్రజల పక్షాన హక్కుల సాధనకు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ చంద్రగిరి శంకర్, సీపీయూఎస్ఐ జిల్లా కార్యదర్శి వావిలాల లక్ష్మణ్‌తో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై ఎండీ.శాఖాన్

చిట్యాల: ప్రతి వాహనదారుడు వాహన పత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకు పోవాలని ఎస్సై ఎండి.షఖాన్ తెలిపారు. సోమవారం మండలంలోని చల్లగరిగ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడపొద్దన్నారు. ఒకవేళ మద్యం తాగిన, అనుమతి పత్రాలు లేకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



సత్యనారాయణరావు కలిసిన నాయకులు

మొగుళ్లపల్లి: అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం భూపాలపల్లికి విచ్చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నంచందర్ నేతృత్వంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజ్ రమేష్, జిల్లా నాయకులు మల్సాని రాజేశ్వర్ రావు, ఏలేటి శివారెడ్డి, కొత్తూరి రవీందర్ రెడ్డి, పడిదల ప్రకాశ్‌రావు, బద్దం మోహన్ రెడ్డి, వీణవంక సునీల్, పాలంపల్లి శంకర్, దేవునూరి నరేష్, ఏలేటి నరసింహారెడ్డి, ఎండీ రఫీ, బండారి రాజు తదితరులు ఉన్నారు.



సంపత్‌ను ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే సన్మానం

టేకుమట్ల: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కత్తి సంపత్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సన్మానించారు. సోమవారం గణపురం మండలం, బుద్దారం నుంచి భూపాలపల్లి వరకు నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో స్వయంగా ఎమ్మెల్యేనే తలపాగా పెట్టి శాలువాతో సన్మానించారు. కత్తి సంపత్ బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గెలుపునకు కృషి చేశారు. విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును సన్మానించేందుకు వెళ్లిన కత్తి సంపత్‌ను అభిమానంతో ఎమ్మెల్యేనే సన్మానించి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



డైరెక్టర్లతో మాట్లాడుతున్న చైర్మన్ రామరావు

మల్హర్: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని సొసైటీ చైర్మన్ చెప్యాల రామరావు అన్నారు. మండలంలోని తాడిచర్ల సహకార సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ డైరెక్టర్లతో చైర్మన్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత వానకాలం 2023–24 సీజన్ ధాన్యం కేంద్రాల నిర్వహణ, బాధ్యతలు, తీసుకోవాల్సి జాగ్రత్తలపై డైరెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, డైరెక్టర్లు వోన్న తిరుపతిరావు, మల్క రాజేశ్వర్‌రావు, రమేష్‌రెడ్డి, సంగెం రమేష్, రాము, ఇప్పమొండి, సీఈఓ సంతోష్ పాల్గొన్నారు.

అన్నదానం



నైవేద్యం తీసుకెళ్తున్న దాత

కాటారం: మండలకేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండలకేంద్రానికి చెందిన గట్టయ్య సోమవారం అయ్యప్ప మాలాధారణ స్వాములకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన దాతను శాలువాతో సన్మానించారు. ఆలయంలో కొనసాగే నిత్యన్నదాన కార్యక్రమానికి దాతలు విరాళాలు అందించి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్‌గుప్త, సభ్యులు జక్కు మొగిలి, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని తాళ్లపాడులో చైతన్య గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీటీసీ పోశాల అనితవీరమల్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అలువాల రవి, సీసీ ఐలయ్య, వీఓలు రామిండ్ల జ్యోతి, శెట్టి మంజుల, సాదరాజప్రమీల, వనమాల ఉన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసె వద్ద స్థానికులు

మల్హర్: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో ఓ గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలో వల్లెకుంటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ అర్జయ్య, భార్య వారి కుమారుడుకి అనారోగ్యం కారణంగా కరీంనగర్ ఆస్పత్రికి వెళ్లారు. ఇంట్లో ఉన్న కూమర్తె ఉదయం పూజలు చేస్తున్న క్రమంలో దేవుడికి దీపం పెట్టింది. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు వచ్చి గుడిసె అంటుకుంది. చుట్టూ పక్కల వారు గమనించి మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదదో పాటు గుడిసె సగం కాలిపోయింది. దీంతో రూ.80వేలకు నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని అర్జయ్య వేడుకుంటున్నారు.

కాటారంలో పందుల స్వైరవిహారం



గారెపల్లిలో తిరుగుతున్న పందులు

కాటారం: మండల కేంద్రలోని పంచాయతీ పరిధిలో పందులు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలితో పాటు పలు కాలనీలు, జనసంచారం అధికంగా ఉండే చోట పందులు నిత్యం తిరుగుతున్నాయి. పదుల సంఖ్యలో పందులు వీరంగం సృష్టిస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కూరగాయల తోటల్లో, వరిధాన్యం కుంప్పలను పందులు ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట పెద్ద మొత్తంలో పందుల గుంపులు తోటల్లో ప్రవేశించి తీవ్ర నష్టం చేస్తున్నాయని వాపోతున్నారు. పందులు ఇలానే జనసంచారంలో తిరిగితే రోగాల బారిన పడాల్సి వస్తుందని అంటున్నారు. పందుల కట్టడికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



వెంకటాపురం(కె) : ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మంగపేట: శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మంగపేట : మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖర స్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ మైల నరేష్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని ఆలయ పూజారి నరేష్‌శర్మ అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణానికి తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో హోమం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొమరగిరి కేశవరావు, సామ్రాజ్యం దంపతులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఉసిరి, తులసి చెట్టుకు కల్యాణం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తులసి, ఉసిరి చెట్టుకు కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ నిర్వహించారు. ఉసిరి చెట్టు(జనార్దన విష్ణుమూర్తిగా), తులసి చెట్టు(లక్ష్మీ దేవి)గా కొలచి వివాహ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోడెం రమేశ్, డైరెక్టర్ బ్రహ్మం, అశోక్‌గౌడ్, ఇర్సవడ్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక జ్యోతిర్ మహోత్సవం

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని మంగపేట గోదావరి రేవుకు వెళ్లే దారిలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం కార్తీక జ్యోతిర్ మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా సాయంత్రం వేళ స్వామి వారికి ప్రత్యేక పూజతో పాటు సింధూరం, నాగబెల్లి నిర్వహిచారు. అనంతరం ఆలయం వద్ద 10,302 వొత్తులు వెలిగించారు. కార్తీక జ్యోతిర్ మహోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది.

పాలెం ప్రాజెక్టు వద్ద వనభోజనాలు

మండల పరిధిలోని పాలెం ప్రాజెక్టు సమీపంలో సోమవారం మున్నూరు కాపు సంఘం సభ్యులు వనభోజన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజ చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం భద్రాచలం నియోజక వర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు, నాగరాజు, బెజ్జని సత్తిబాబు ఉన్నారు.



మంగపేట: శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ నరేష్ రెడ్డి దంపతులు



ఏటూరునాగారం: ఉసిరి, తులసి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణ తంతులో పాల్గొన్న భక్తులు

వేతనాలు ఇవ్వడం లేదని ధర్నా

ఏటూరునాగారం : ఐదు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే చెల్లించాలని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలు సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తుడుందెబ్బ జాతీయ రాష్ట్ర నాయకుడు పొడెం రత్నం, పొడెం బాబు తదితరులు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో 40 మంది ఏఎన్ఎంలు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న నవీన్

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రేనుకుంట్ల సమ్మయ్య తల్లి రాజమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సోమవారం హనుమకొండ లావణ్య ఆస్పత్రి అధినేత డాక్టర్ నవీన్ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సంతోష్, మొండయ్య, పెద్ద సమ్మయ్య, రాము, రాకేష్, నేరేళ్ల రామకృష్ణగౌడ్, రవి, తదితరులు ఉన్నారు.